# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. అమరావతిలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు హడ్కో సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
2. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ప్రారంభించిన పల్లె పండుగ పనులు సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.
3. రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించిన తుది ముసాయిదాను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
4. తెలంగాణలో అర్హులైన వారందరికీ రెండు పడకల ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు.
5. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సరళీకృత విధానంలో ఇసుకను ఉచితంగా అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు హడ్కో సంసిద్ధత వ్యక్తం చేసినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. రాజధాని నిర్మాణానికి హడ్కో 11వేల కోట్ల రూపాయలు రుణాలిచ్చేందుకు ముందుకు రావటం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంస్థ అందించే రుణ విధివిధానాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణతో హడ్కో చైర్మన్, ఎండీ సంజయ్ కుల్‌శ్రేష్ట నిన్న సమావేశమై చర్చించారు. మరోవైపు జాతీయ సంస్థలతో పాటు వ్యాపార, ఐటీ సంస్థలు అమరావతిలో కార్యాలయాలు ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం వారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

--------------------------

పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20 మధ్య ప్రారంభించిన పల్లె పండుగ పనులు సంక్రాంతిలోగా పూర్తయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అధికారులను నిన్న ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న 30 వేల పనులు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

---------------------------

యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయనికి సంబంధించిన బిల్లును సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించిన తుది ముసాయిదాను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ క్రీడా విధానంపై జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన నిన్న ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వచ్చే రెండేళ్లలో జాతీయ క్రీడలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్'ను సంప్రదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా ప్రభవిత ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ నిన్న పర్యటించారు. పర్యటన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో భూగర్భజలాలు కలుషితం కావటం, బోర్లలో ఫిల్టర్లు లేకపోవటం వల్ల 15 మందికి డయేరియా సోకిందని తెలిపారు. ఇతర అనారోగ్య కారణాల వల్ల ఇరువురు మృతి చెందినట్లు పేర్కొంటూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

తెలంగాణలో అర్హులైన వారందరికీ రెండు పడకల ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో పలు అభివృద్ధి పనులుకు మంత్రి నిన్న శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ, భూమి పట్టాలు ఇప్పిస్తామని దళారులు మోసం చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వమే అర్హులకు పట్టాలు ఇస్తోందని చెప్పారు.ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు 2 లక్షల రుణమాఫీ చేశామని.. దీపావళి తర్వాత మరో 4 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయనున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఇసుకను సరళీకృత విధానంలో ఉచితంగా అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో క్షేత్ర స్థాయిలో ఇసుక ర్యాంపులను ఆయన నిన్న పరిశీలించారు. బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులు తీసుకువచ్చే ఇసుకను ఆన్‌లైన్ , ఆఫ్ లైన్ విధానంలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలియజేస్తూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో త్వరలో 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వెల్లడించారు. హైదరాబాద్ ప్రగతినగర్‌లోని ఎలీప్ మహిళా పారిశ్రామికవాడలో 'ఎంఎస్ఎంఈ డిఫెన్స్ కాన్‌క్లేవ్' అంశంపై నిన్న నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో రక్షణశాఖకు అవసరమైన ఉత్పత్తులను తయారు చేయించి మహిళలకు ప్రోత్సాహం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా అంతకుముందు అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను మంత్రి పరిశీలించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన-2 పథకం కింద పేదలు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటినే పూచీకత్తుగా పరిగణించి, బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చూడాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

---------------------------

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాల్లో ఒకటిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ – నరెడ్కో ప్రాపర్టీ షో కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధిలో నరెడ్కో ఒక భాగమని, ప్రభుత్వం వ్యాపార రంగానికి అండగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్‌లో మౌలికసదుపాయాల కల్పన కోసం 10వేల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ప్రపంచ స్థాయి నైపుణ్య విశ్వవిద్యాలయం, క్రీడా విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, మెట్రో విస్తరణ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలియజేశారు.

---------------------------

పదో తరగతి పబ్లిక్ పరీక్షల రుసుము చెల్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 28 నుంచి నవంబరు 11లోపు ఫీజు చెల్లించాలని పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 125 రూపాయలు, సప్లిమెంటరీ రాసేవారు మూడు సబ్జెక్టుల వరకు 110 రూపాయలు, అంతకంటే ఎక్కువ ఉంటే 125 రూపాయలు, వృత్తి విద్యా విద్యార్థులు అదనంగా 60 రూపాయలు చెల్లించాలని ఆయన వెల్లడించారు. నిర్ణీత గడువులోగా చెల్లించలేని విద్యార్థులు నవంబర్ 12వ తేదీ నుంచి 18 వరకు 50రూపాయలు, 19 నుంచి 25వ తేదీ వరకు 2 వందల రూపాయలు, 26 నుంచి నవంబరు 30వ తేదీ వరకు 5 వందల రూపాయల ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్‌లోనే పరీక్ష ఫీజు చెల్లించాలని, పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులూ చెల్లించవచ్చని సూచించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధిని విస్తృతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలపై తెలంగాణ ఓవర్సీస్ మానవ వనరుల సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నవంబర్ రెండవ వారంలో హుస్నాబాద్‌లో విదేశీ ఉద్యోగ మేళా నిర్వహించాలని, అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలివ్వాలని కంపెనీల ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఈ ఉద్యోగ మేళాకు నమోదు చేసుకోవాలని యువతను కోరారు.

=====================